

కథ

# ఇగురం

భాగ్యరేఖ

చీకటైంది...గన్మల నిలబడి అక్కడిక్కడ జూస్తుంది లచ్చిమక్క. బర్రున ఇస్కూటర్ మీదేచ్చి ఆగిండు సీరాములు.

ఎదురుగింట్ల ఉంటడు.

"ఎన్ని దినాలయెరో నిన్ను జూశి... కన్నవడ్తనే లేవు" పల్కరిచ్చింది లచ్చిమక్క.

"ఔవ్వే పెద్దమ్మ! ఈ మద్యల జెర సీకటైయొస్తున్న. మీ తల్పువెట్టుం టుంది... ఇంక బోజనం గానట్టుంది?"

"లే...ఇంకగాలే బిడ్డ జెరైనంక దింటం."

"పెద్నాయ్న బాగుండా"

"ఆ"

కవర్ల ఏందో పొట్లముంది.

లచ్చిమక్క సూశిందిగదా అని తీశి ఇయ్యవొయిండు.

"ఏందిరా అదీ..."

"చౌపప్పు"

జోబుల కోటర్ సీస ఉన్నట్టుంది ఎత్తుగ గనవడ్తుంది.

తాగుకుట్టు అంచుకు దినసీకె దెచ్చుకున్నడని అర్త మైంది లచ్చిమక్కకు.

"ఒద్దుబిడ్డా!"

"ఏ...తీస్కో పెద్దమ్మా!"

"ఒద్దురా! ఇంట్లనే అవి ఇవి మూల్గుతున్నయ్ ఎక్వ తక్వ దినే ఒయిసు గాకపాయె".

మల్ల పొట్లం కవర్ల పెట్టుకుండు.

"మరి పిల్లలకేం దీస్కున్నవురా?"

"ఏం దీస్కోలె"

"అట్లా!"

"ఏ...తాగేతప్పుడు ఇంత అంచుకైతదని దెచ్చుకున్న నామట్కు"

"సత్యమే కొడ్కా! కని పిల్లలైరి. అల్లకేదన్న సూస్తె తినబుద్దాయె. మన కేద న్న గొన్కున్నప్పుడు, అల్లకింత ఏమన్న గొన్కరావాలె బిడ్డా! మనం గాకుం టె అల్లకెవరిప్పిస్తరు?"

"ఇగ నేన్దాగినప్పుడల్ల అల్లకుగ్గూడ ఏందన్న దేవాలంటె యాడైతది పెద్ద మ్మ! ఐనా అల్లకేం తక్వయితుంది తింటలేరా ఉంటలేరా, అల్లతిండి, బట్ట లు, సదువులకే వస్తుగేతున్నయి. ఇంటికొస్తె అయిపాయె. ఇది లేదు అది లేదు దీనికి పైసలుగావాలె దానికి పైసలు గావాలెనని పానం దీస్తుంట రు. అట్ల గాదు–పెద్దమ్మ! పైసలడ్గనీకె టైమనేదుండదానే..." ముచ్చట ఇంకో దిక్కు మల్లిండు.

లచ్చిమక్క మద్యల్నె అందుకుంది.

"ఊకోరా! పతి మొగోడు ఇదే మాట. ...పొద్దుగాల అడుగుతె శురువైందా పొద్దున్నె... అంటరు. మాపట్కి అడుగు తె ఇంటికి రాంగనె పానం దింటరం టారు. ఎప్పుడడ్గాల్రా మిమ్మల్ని? పోనీ ఓ టైం చెప్పుర్రి అదే టైముకడ్గుతరు. ఐనా నాకు దెల్వ కడుగుత నువ్వు పెండ్లి జేస్కుంటెనే పెండ్లామొచ్చె... నువ్వు గంటెనే పిల్లలైరి. అల్లు ఆకాశంల కెలి ఊడిపడ్డార్రా! సంసారమన్నంక కర్సు లు గావు? ఐనా...నువ్వు పెండ్లి కొత్తగ జేస్కున్నవా? తరతరాల సంది లచ్చల మంది కోట్ల మంది సంసారాలు జేస్కుం టొస్తున్నరు. సంసారమంటేందో దెల్వకనె జేస్కున్నవా ఎర్రి పిల్లగాడవు."

సీరాములు సల్లగైపోయిండు లచ్చిమక్క జెర శాంతమైంది. మెల్లెగ మల్ల శురువ్వె ట్టింది.

"కోపం దెచ్చుకోకు బిడ్డా! జెర నిదా నంగా ఆలోచన జెయ్యి. ఇప్పడ్దాక నీకు దెచ్చుకున్న పొట్లం నాకియ్యవోతివి. నేనెవర్నిర?..ఇంటి ముంగల ఉన్నదాన్ని... సుట్టం గాకపోతి కులం గాకపో తి. అట్లనే దోస్తు లెంబడి దిరిగి... అల్లకు తాగుడు వొస్తివి, నువు దాగితివి అప్పుడు కర్సుగాలే? మంది మీద ఇంత కర్సు వెట్టినోనివి... నీ పెండ్లాం పిల్లలకు ఒక్క చౌపప్పు పొట్లం దెచ్చెతాన ఒడిపోతివి. అదెంతరా? రొండు రూపాలు.

అల్లెవర్రా? పొద్దున్లేస్తె నీకు నీ సంసారానికి చాకిరి జేశి పొద్దుమీకితె నీ పక్కల వండేది, నీ పెండ్లం. పెట్టినా తిట్టినా నీ యెంటె ఉంటది నీకోసమె పాటు పడ్తది. ఆ పిల్లలు....నువుగంటె వుట్టిరి. మరి నువు వెంచితె వెర్గు తరు. అల్లకు కడుపుంటది, ఆలోచనుంటది, మన్సుంటది, నా మొగడు, మా నాయ్న అని నీమీద ప్రేముంటది. నువ్వు మంచిగ సూడాల్నని ఆశుంట ది. అల్లకు నువ్వు దప్ప ఎవరున్నర్ర?

సంసారమంటెనే కర్సు బిడ్డా...ఆ కర్సుకోసమె తరతరాల సంది మొగో డు కర్మ జేస్కుంట వొస్తున్నడు. అట్లనె...నువ్వు పనితనం చేస్తున్నవు.

నీ పెండ్లామేం ఉట్టిగ గూసోని తింటాది బిడ్డ! పొద్దున్లేస్తె నువ్వు మల్లొచ్చెదాక ఒంట, పిల్లలు, బట్టలు, బాసన్లు, దాని సత్తువకు అదిగూడ పనితనం జేస్కుంట పోరాడ్తనే ఉంటది. ఆకిర్కి... పిల్లలు గూడ సదువులనుకుంట అల్ల కష్టం అల్లు వడవట్రి.

ఐనా...దోస్తుల ముంగట, మంది ముంగట కర్సు వెట్టి మొనగానివనిపించుకునాలె. కాదంటలేను బిడ్డా! అంతకంటె మంచి గాల పెండ్లాం తోటి మొగడనిపిచ్చుకోవాలె. పిల్లలతోటి నాయ్న మంచోడనిపిచ్చుకోవాలె. గంతె! ఏమన్న తప్పు జెప్పితె ఏమన్కోకు కొడ్క.

ఎవలెట్లవోతె నాకేందిగని...నువ్వు పుట్టినసంది నిన్ను సూస్తున్న నా ముంగట ఆడిపాడి నోనివి. నా కొడుకు లాంటోనివి బిడ్డా. అట్లని ఇందంతె ల్లవెట్టిన. నువ్వు నీ పెండ్లాం పిల్లలతోటి సంతోషంగా, సల్లగుండాలె, నువ్వే పనితనం జేశినా నీకు జెయం గావాలె నాయ్నా! నేను గోర్కునేదదొక్కటె."

"ఎంత మాటంటివి పెద్దమ్మ! నువ్వు నాకు తప్పేందుకు జెప్పినవు? నా తప్పు ఎతి సూపినవు గని. మా అమ్మోటి నువ్వోటా పెద్దమ్మ నాకు?"

యాదార్తంగానే అన్నడు సీరాములు.

"ఒరెయ్ నానిగా..." పిల్లల విల్శిండు గట్టిగ.

పిల్లలు లొల్లి జేస్కుంట ఉర్కొచ్చిండ్రు. చౌపప్పు పొట్లం దీశి పిల్లలకి చ్చిండు.

'అమ్మ కియ్యి పోండ్రి గిన్నెల వెట్టిస్తది కూకోని నిదానంగ దినుండ్రి."

లచ్చిమక్క నిదానంగ లోపటికి వొయింది.